క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొల్లిపర: కొల్లిపర సబ్‌స్టేషన్ పరిధిలోని పిడపర్తిపాలెం ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏఈ పి.ప్రదీప్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పిడపర్రు, పిడపర్తిపాలెం గ్రామాలతో పాటు కొల్లిపర అగ్రికల్చర్ విద్యుత్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా జగ్గడిగుంటపాలెం, పెదరావూరు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెనాలి డీ–2 ఏఈ ఎం.లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తెనాలి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ బదిలీ



తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె తెనాలి అసిస్టెంట్ కమిషనర్‌గా సుమారు సంవత్సరం పాటు పనిచేశారు. రెండు రోజుల్లో ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యే అవకాశం ఉంది. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు.

రోడ్డు పనులు పూర్తి చేయించండి



తెనాలిఅర్బన్: 6వ వార్డులోని దేవినేని వారి వీధిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు మధ్యలో నిలిపివేశారు. దీంతో రోడ్డు గుంతలు పడి వాహనాల రాకపోకలకు అవరోధంగా తయారైంది. దీనివలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని కౌన్సిలర్ కొత్రపాటి లక్ష్మీ తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పునఃప్రారంభించి పూర్తి చేయాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

తెనాలిరూరల్: పట్టణంలోని పేకాట శిబిరంపై త్రీ టౌన్ పోలీసులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తెనాలి రైల్వేస్టేషన్ ఎదురు రోడ్డులోని కృష్ణ మందిరం పక్క సందులో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ నక్కా ప్రకాశరావు, ఏఎస్‌ఐ హైదర్ అలీ, సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.44,170, సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు. ఇంటిని అద్దెకు తీసుకుని పేకాట శిబిరంగా మార్చారని పోలీసుల విచారణలో తేలింది. నిందితులను కోర్టులో హాజరు పర్చనున్నట్టు పోలీసులు తెలిపారు.

నేడు గ్రామ సభలు

కొల్లిపర: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి చెందిన నూతన ఉపాధి పనులు గుర్తించి, వాటి మంజూరుకు మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు గ్రామ సభలు నిర్వహించటం జరుగుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లకు గ్రామ సభలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి కనీసం 100 రోజులు వేతన ఉపాధి కల్పించాలని సూచించారు. గ్రామ సభలో ఉపాధి పనులు గురించి అధికారులు పూర్తిగా చదివి వినిపించాలని, సభలో ఆమోదం కాబడిన పనుల అంచనాలు త్వరితగతిన పూర్తి చేసి నివేదిక అందించాలని అన్నారు. గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శులు మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఆయా గ్రామాల అధికారులు సభకు 30 నిమిషాల ముందే ఉండాలని, ప్రతి శాఖ అధికారి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దాడి ఘటనపై పరస్పర కేసులు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనపై పరస్పర కేసులు నమోదయ్యాయి. రూరల్ ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కంచర్లపాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి పుష్పరాజ్, అతని బాబాయి రామారావు ఇంటి స్థలం విషయంలో ఘర్షణ పడి పరస్పరం దాడికి పాల్పడ్డారు. ఇద్దరూ పోలీసులను ఆశ్రయించగా రెండు కేసులను నమోదు చేసినట్టు ఎస్‌ఐ గురువారం తెలిపారు.

తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుదాం

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. నాల్గవ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మున్సిపల్ స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆక్రమణలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఖాళీ స్థలాలను బాగు చేయించుకోండి

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని ఖాళీ స్థలాలను యజమానులు వెంటనే బాగు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో సూచించారు. పట్టణంలోని అనేక ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలతో నిండాయని, దీని వలన దోమల వ్యాప్తి పెరిగి రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. స్థల యజమానులు ఇతరులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. అలా చేయని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

అప్రకటిత కోతలు.. సరఫరాలో హెచ్చుతగ్గులు

- పట్టణంలో పలు చోట్ల విద్యుత్ సమస్య
- పాడవుతున్న గృహోపకరణాలు



లో వోల్టేజ కారణంగా భాస్కరరావు దిబ్బలో పాడైన ఏసీ ఔట్‌డోర్ యూనిట్

తెనాలిరూరల్: పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో లో వోల్టేజి, హెచ్చు తగ్గుల సమస్యతో ప్రజలు బాధపడుతున్నారు. అప్రకటిత కరెంటు కోతలతో ఎప్పుడు కరెంటు వస్తుందో, పోతుందో తెలియక అవస్థలు పడుతున్నారు. పట్టణ నందులపేట శివారు భాస్కరరావు దిబ్బ, ఐతానగర్ శివారు, నందులపేటలోని కొన్ని ప్రాంతాల్లో ప్రధానంగా వోల్టేజి హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ వాడకం పెరగడంతో ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్‌లు సరిగా పని చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఒక్కోసారి ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అయిపోతున్నాయని, విద్యుత్ సరఫరాలోనూ తీవ్ర హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. దీని వల్ల గృహోపకరణాలు దెబ్బతింటున్నాయి. మరో వైపు రెండు గేట్ల మధ్య ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఎప్పుడు నిలచిపోతుందో తెలియని పరిస్థితి. నాలుగు రోజుల క్రితం తెల్లవారుజామున సరఫరా నిలిచిపోయి సుమారు మూడు గంటల పాటు రాలేదు. భాస్కరరావు దిబ్బ కాలనీలో రెండు లైన్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఇందులో ఒక లైనులో సరఫరా ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి. ఒక్కోసారి రాత్రంతా కరెంటు ఉండదని స్థానికులు చెబుతున్నారు. నాణ్యమైన విద్యుత్, ఉచిత విద్యుత్ అంటూ రాజకీయ నాయకులు ఎన్నికల సందర్భంలో ఊదరగొట్టారని, నియోజకవర్గ కేంద్రంలో సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై విద్యుత్ ఏడీఏ బి.అశోక్‌కుమార్‌ను సంప్రదించగా విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉన్న వారు సమస్యను తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హెచ్చుతగ్గుల కారణంగా ఏసీ పాడైంది



ఏకలవ్యనగర్ (భాస్కరరావు దిబ్బ) కాలనీలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. దీని కారణంగా ఇంట్లోని గృహోపకరణాలు పాడవుతున్నాయి. కరెంటు సమస్యల వల్ల మా ఇంట్లో ఏసీ ఇటీవల పాడైంది. ఎవరికి చెప్పినా కరెంటు విషయాన్ని పట్టించుకోవడం లేదు.

దేవరకొండ దేవి, ఏకలవ్య నగర్

శాశ్వత కట్టడాలకు భారతి సిమెంట్ మేలు



మేస్త్రికి బీమా బాండ్ అందజేస్తున్న ఎంపీపీ చెన్నకేశవులు

తెనాలిరూరల్: భవన నిర్మాణాలు శాశ్వతమైనవని, నిర్మాణం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంటు ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎన్.భవానీశంకర్ సూచించారు. తెనాలి గంగానమ్మ పేటలోని లక్ష్మీ స్టీల్ కార్పొరేషన్ సహకారంతో గురువారం రాత్రి స్థానిక రాధామాధవ్ ఫంక్షన్ హాలులో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి తయారు చేసిన భారతి సిమెంటు కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదపడుతుందన్నారు. సిమెంటు తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుందని తెలిపారు. భారతి అల్ట్రా ఫాస్ట్ రకం సిమెంటు గురించి వివరించారు. భవానీ శంకర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించిన కాంక్రీట్‌తో వేసిన శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలు చేసి నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యజమానులకు వివరిస్తారని చెప్పారు. ఇందుకు సంబంధిత డీలరు ద్వారా వివరాలు తెలుసుకుని తమకు సమాచారం అందిస్తే సరిపోతుందన్నారు. మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ద్వారా అందజేశారు. లక్ష్మీ స్టీల్ కార్పొరేషన్ యజమాని ఎం.గోపాలరెడ్డి, ఇతర డీలర్లు, భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల నిరసన



తెనాలి: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం తెనాలిలో ఎల్‌ఐసీ మహిళా ఉద్యోగులు నిరసన తెలియజేశారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట తెనాలి బ్రాంచి ఉద్యోగులు, ఏజెంటు మిత్రులు గేట్ మీటింగ్ నిర్వహించారు. వైద్యురాలిపై హత్యాచారం కేసును సమగ్రంగా దర్యాప్తు చేయాలనీ, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన వైద్య ప్రముఖులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, డాక్టర్ శారద, డాక్టర్ నారాయణం అనిల్‌కుమార్, డాక్టర్ రమ్య, వాసిరెడ్డి ప్రియబాంధవి, ఎల్‌ఐసీ తెనాలి శాఖ మహిళా నేత ఆండాళ్ల పాల్గొన్నారు.

వేజండ్ల పీఏసీఎస్‌లో త్వరలో ఎరువుల అమ్మకాలు

వేజండ్ల(చేబ్రోలు): వేజండ్ల వ్యవసాయ సహకార పరపతి సంఘంలో త్వరలో రైతులు ఎరువులు విక్రయించనున్నట్లు పీఏసీఎస్ అఫీషియల్ పీఐసీ ఎస్ భవన్నారాయణ రాజు తెలిపారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలోని పీఏసీఎస్‌లో గురువారం ఆయన మాట్లాడారు. కొద్ది రోజుల్లో వేజండ్ల పీఏసీఎస్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఎరువులు అమ్మనున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 2 నుంచి పీఏసీఎస్ సేవలను ఆన్‌లైన్ చేయటానికి కృషి చేస్తోందని, దీనిలో భాగంగా కంప్యూటరీకరణ వేగంగా జరుగుతుందని వివరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అర్హులైన రైతులందరికీ పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు అందజేస్తున్నట్లు భవన్నారాయణ రాజు తెలిపారు.

వ్యర్థాలతో వ్యాధులు

ప్రత్తిపాడు: వ్యర్థాల వలన ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని వాటర్ ఎయిడ్ సంస్థ గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ సురేష్ చెప్పారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నీటి నాణ్యతతోపాటు నీటి శుద్ధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. సురేష్ మాట్లాడుతూ సూచనలు, సలహాలు అందించారు. అడ్మిన్ ఆఫీసర్ సాయి మాట్లాడుతూ ఆరోగ్యహిత గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

మద్యానికి బానిసై.. దొంగలుగా మారారు


నలుగురు మోటార్, ఐరన్ దొంగలు అరెస్టు



అరెస్టు చేసిన నలుగురు నిందితులతో ఎస్‌ఐ నాగేంద్ర, కానిస్టేబుల్స్

ప్రత్తిపాడు: ఆ నలుగురూ స్నేహితులు మద్యానికి బానిసయ్యారు. వ్యసనాలకు డబ్బుల్లేక దొంగతనాలకు పాల్పడుతూ చివరికి కటకటాలపాలయ్యారు. పోలీస్ స్టేషనులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నాగేంద్ర కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరురూరల్ మండలం దాసరి పాలెం ప్లాట్స్‌కు చెందిన షేక్ మస్తాన్, కగ్గా ఏడుకొండలు, అంబల నరేంద్ర, దొండపాటి ప్రశాంత్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో వీరి మధ్య స్నేహం ఏర్పడింది. నలుగురూ మద్యానికి అలవాటుపడ్డారు. తాగేందుకు, వ్యసనాలకు డబ్బులు లేకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 20న గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం సమీపంలోని పదహారో నంబరు జాతీయ రహదారి వెంబడి ఉన్న వైష్ణవి టౌన్ షిప్ వెంచర్‌లో నీటి మోటార్‌తో పాటు ఇనుప రాడ్లను దొంగిలించారు. దీంతో వెంచర్ సూపర్‌వైజర్ తలశిల మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన పోలీసులు గురువారం నడింపాలెం హైవేపై అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని తమదైన శైలిలో ప్రశ్నించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఒక నీటి మోటార్‌తో పాటు ఏడు ఇనుపరాడ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి గుంటూరులోని 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

ధ్యేయ'మొక్క'టే పర్యావరణ పరిరక్షణ



కాకుమాను జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రత్తిపాడు/కాకుమాను: పర్యావరణ పరిరక్షణే ప్లాంట్ ఫర్ మదర్ ధ్యేయమని సర్పంచ్ శిఖా విజయలక్ష్మి చెప్పారు. వంగిపురంలో గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఏపీఓ మస్తాన్‌వలి నేతృత్వంలో గ్రామ సర్పంచ్ శిఖా విజయలక్ష్మి స్థానిక రక్షిత మంచి నీటి చెరువు గట్టుపై మొక్కలు నాటారు. కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



పెదకాకాని: పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై.నేతాజీ డిమాండ్‌చేశారు. వెనిగండ్ల పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులతో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ సెప్టెంబరు 10న రాష్ట్ర సదస్సు జరుగుతుందని, సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తెనాలి అర్బన్: మహిళ భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని సీఐటీయూ నాయకులు కొల్లిపర బాబూప్రసాద్ డిమాండ్ చేశారు. కోల్‌కతాలో వైద్యురాలిపై లైగింకదాడి, హత్యను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శ్యాం, సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్ వలి, ఏవీఎన్ కుమారి, లావణ్య, బుల్లెమ్మాయి, జె.అరుణ, వి.అనిత్, కె.రాజ్యం, ఎం.మణి, ఎస్.రాజ్యలక్ష్మి, వై.ఈశ్వరి, చంద్రకళ పాల్గొన్నారు.

అంతర్జాతీయ జానపద దినోత్సవం



అంతర్జాతీయ జానపద దినోత్సవంలో ప్రముఖులు



జానపద గేయాలాపన

తెనాలి: పట్టణానికి చెందిన సాంస్కృతిక సంస్థ అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కాలేజీలో అంతర్జాతీయ జానపద దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రారంభ సభకు వైష్ణవి కాలేజి ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. శ్రీహనుమాన్ సేవా సమితి వ్యవస్థాపకుడు, శశి గ్రూప్ కంపెనీస్ అధినేత ఉప్పల వరదరాజులు, కవి/రచయిత డాక్టర్ రంగిశెట్టి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పల్లె ప్రజల మధ్యన సహజసిద్ధంగా పుట్టిన జానపద కళలు, పల్లెవాసుల గుండెచప్పుడని చెప్పారు. మన సాంస్కృతిక వారసత్వాన్ని అర్థం చేసుకుని, భవిష్యత్ తరాలకు తీసుకెళ్లటం మనందరి బాధ్యతగా చెప్పారు. అభ్యుదయ కళాసమితి వ్యవస్థాపకుడు బొల్లిముంత కృష్ణ సంగీత సహకారంతో గాయకుడు బెల్లంకొండ వెంకట్ ఇతర జానపద కళాకారులు జానపద గీతాలను ఆలపించారు. జానపద నృత్యాంశాలను ప్రదర్శించారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



జిల్లా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్, మురళి

తెనాలిఅర్బన్: ప్రముఖ సినీ హీరో, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను మంచాల రామకృష్ణ, జిడుగు తులసి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను వారు కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. అలాగే జిల్లా వైద్యశాల ఆవరణలోని తల్లిపిల్లల వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రామకృష్ణ, తులసి మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచనల మేరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిరంజీవి మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, సినీ పరిశ్రమకు, రాజకీయ రంగానికి ఆయన ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, న్యాయవాదులు పొన్నం విజయ్‌కుమార్, దంతాల కిరణ్‌కుమార్, వీరవల్లి మురళి, నన్నపనేని రాంబాబు, కరేటి వీరయ్య, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తోట పానకాలరావు, సాయి, శ్రీరామ్ పాల్గొన్నారు.

- చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని కాళిదాసు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ సేవా శాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తట్టుకుళ్ళ ఆశోక్‌యాదవ్, కుర్రాశ్రీను, పెసర్లంక రమణ, మిక్కిలి శరత్, షేక్ దావూద్,బెల్లపు యశ్వంత్, షేక్ రఫీ, కోలా వాసు, నల్లగొర్ల నాగేశ్వరరావు, ఎస్.సురేష్, కొల్లా గురునాధ గుప్తా, వెంకటేశ్వరరావు, సుబ్రమణ్యం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- సినీ రంగంలో తన ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి మెగాస్టార్ చిరంజీవి అని న్యాయవాది పొన్నం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. వంగవీటి రంగా స్మారక కాపు యువజన సేవా సమితి వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ భవనంలో గురువారం బిల్డర్ కొండూరు శివయ్యను ఘనంగా సన్మానించి స్వయంకృషి పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో దాది సూరయ్య, దైవాల సుబ్రమణ్యేశ్వరరావు, కఠారి హరీష్, కమ్మెల రజనీ, దివ్వెల ఏడుకొండలు, పెటేటీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ రైతు, వ్యాస రచయిత సుదర్శనబాబు మృతి



తెనాలి: పట్టణానికి చెందిన అభ్యుదయ రైతు, వ్యాస రచయిత, పుస్తక ప్రచురణకర్త కొడాలి సుదర్శనబాబు (68) అనారోగ్యంతో కన్నుమూశారు. కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోని కుమార్తె నివాసంలో ఉంటున్న సుదర్శనబాబు గురువారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుదర్శనబాబు స్వస్థలం బాపట్ల జిల్లా అమృతలూరు మండల పరిధిలోని మోపర్రు. ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు, ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో మంత్రిగా చేసిన కల్లూరి చంద్రమౌళి మనుమడు. కల్లూరి చంద్రమౌళి జీవిత చరిత్ర, మోపర్రు గ్రామ చరిత్ర పుస్తకాలను తీసుకొచ్చారు. పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చి, సర్పంచ్‌లకు చెక్ పవర్‌ను కట్టబెట్టిన చంద్రమౌళి స్ఫూర్తితో గ్రామాభ్యుదయంపై పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. అతి సామాన్యుడిలా గడిపిన చంద్రమౌళిని చివరి రోజుల్లో దగ్గరుండి చూసుకున్నారు. వ్యవసాయం చేస్తూ అతి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధానాలను స్వయంగా అధ్యయనం చేయటమే కాకుండా పత్రికలకు పలు వ్యాసాలను రాశారు. కరోనా బారిన పడి కోలుకున్నప్పటికీ ఊపిరితిత్తుల సమస్య వెన్నాడుతూ వచ్చింది. ఫలితంగానే మృతి చెందారు. స్థానిక సుల్తానాబాద్‌లోని అలపాటి నగర్‌లోని నివాసం నుంచి శుక్రవారం ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర సాగుతుందని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

ప్రత్తిపాడు వాటర్‌ప్లాంట్‌పై రగడ

గ్రామ పాలకవర్గ సమావేశంలో అధికారులను ప్రశ్నించిన వార్డుసభ్యులు



సమావేశంలో వాటర్ ప్లాంట్ విషయమై అధికారులను ప్రశ్నిస్తున్న వార్డుసభ్యులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు వాటర్ ప్లాంట్ విషయమై వార్డు సభ్యులు పంచాయతీ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రత్తిపాడులోని పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సర్పంచ్ వసువర్తి రమాదేవి అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గ సమావేశం జరిగింది. వార్డు సభ్యులు స్థానిక రక్షిత మంచినీటి చెరువు కట్టపై ఉన్న వాటర్ ప్లాంట్‌కు అనుమతులు ఉన్నాయా? లేవా? ఉంటే ఎప్పటివరకు ఉన్నాయి? పూర్తయితే ఎందుకు పంచాయతీ స్వాధీనం చేసుకోవడం లేదంటూ ప్రశ్నలు సంధించారు. ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి కలుగజేసుకుని ప్లాంట్ అనుమతులు పూర్తయిన నాటి నుంచి పంచాయతీ తరపున ఏమైనా బిల్లు రూపంలో ప్లాంట్ నిర్వాహకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారా అని కార్యదర్శిని అడిగారు. అలాంటిదేమీ లేదని కార్యదర్శి చెప్పడంతో, మరి బిల్లుల రూపంలో కాకుండా మీ జేబుల్లోకి ఏమైనా వెళ్లాయా? అని సూటిగా ప్రశ్నించారు. వెళ్లలేదనుకుంటే ప్లాంటు లెక్కలు, వివరాలు చెప్పి, ప్లాంట్‌కు వేలం పాట పెట్టవచ్చు కదా అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వార్డుసభ్యులకు, పంచాయతీ అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. స్పందించిన కార్యదర్శి సాయంత్రం లోపల వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు నోటీసులిచ్చి వివరణ తీసుకుంటామని చెప్పడంతో సభ్యులు శాంతించారు.

డిమాండ్ చేసి లంచాలు తీసుకోవడమేంటీ..!

పంచాయతీ గుమస్తా కోటేశ్వరరావుపై ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి ఫైర్ అయ్యారు. వివిధ పనుల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజల నుంచి డిమాండ్ చేసి మరీ డబ్బులు తీసుకోవడం ఏమిటని మండిపడ్డారు. సమావేశంలో వార్డుసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం చిన్నారులకు భోజనం అందించాలి

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాతదేవి

ప్రత్తిపాడు: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వి.సుజాతదేవి చెప్పారు. ప్రత్తిపాడులోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు సమీక్ష నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. చిన్నారుల బరువులను కొలచి ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.